# భారత్ - బ్యాంకింగ్ వ్యవస్థ

భారత దేశంలో మొట్ట మొదటి జాయింట్ స్టాక్ బ్యాంక్ 1786లో ఏర్పాటైంది. తర్వాత వరుసగా బ్యాంక్ ఆఫ్ హిందుస్థాన్, బెంగాల్ బ్యాంక్‌లు ఏర్పాటయ్యాయి. ఇందులో బ్యాంక్ ఆఫ్ హిందుస్థాన్ 1906 వరకు విజయవంతంగా పనిచేసింది. మిగిలిన రెండు బ్యాంకులు కొద్ది కాలంలోనే మూత పడ్డాయి. తర్వాత ఈస్ట్ ఇండియా కంపెనీ 1809లో బ్యాంక్ ఆఫ్ బెంగాల్, 1840లో బ్యాంక్ ఆఫ్ బోంబే, 1843లో బ్యాంక్ ఆఫ్ మద్రాస్‌లను నెలకొల్పింది. ఈ మూడు బ్యాంకులను ప్రెసిడెన్సీ బ్యాంకులు అనేవారు. ఇవి మూడు స్వతంత్ర సంస్థలుగా సమర్థవంతంగా పనిచేశాయి. తర్వాత 1920లో మూడు ప్రెసిడెన్సీ బ్యాంకులు విలీనమై 1921 జనవరి 27న 'ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'గా అవతరించింది. 1955లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం వచ్చింది. దీంతో ఇంపీరియల్ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గా మారింది. 1934 రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం చేశారు. దీంతో కేంద్ర బ్యాంకుగా వ్యవహరించే భారత రిజర్వ్ బ్యాంకు 1935లో ఏర్పాటైంది.

తర్వాత స్వదేశీ ఉద్యమం నేపథ్యంలో దేశంలో స్వదేశీ యాజమాన్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ లిమిటెడ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, కెనరా బ్యాంక్ లిమిటెడ్, ద సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఏర్పాటయ్యాయి. స్వాతంత్ర్యానంతరం 1969 జులై 19న దేశంలోని 14 ప్రధాన బ్యాంకులను ఇందిరాగాంధి ప్రభుత్వం జాతీయం చేసింది. తర్వాత 1980 ఏప్రిల్ 15న మరో ఆరు పెద్ద వాణిజ్య బ్యాంకులను జాతీయం చేశారు.

తర్వాత 1990 దశం ప్రథమార్ధంలో పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో అర్థిక రంగంలో సరళీకరణ విధానాలు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా కొద్ది సంఖ్యలో ప్రైవేటు బ్యాంకులకు అనుమతి లభించింది. వీటిని 'న్యూ జెనరేషన్ టెక్-సావి బ్యాంక్స్'గా అభివర్ణిస్తారు. ఇందులో మొదటి గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్ (తర్వాత ఈ బ్యాంకు ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌లో విలీనమయ్యింది).తర్వాత వరసగా UTI బ్యాంక్ (ప్రస్తుతం యాక్సిస్ బ్యాంక్), ICICI బ్యాంక్, HDFC బ్యాంకులు వచ్చాయి. దీంతో బ్యాంకింగ్ రంగంలో ప్రైవేటు, జాతీయ బ్యాంకుల మధ్య పోటీ పెరిగి ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. బ్యాంకింగ్ రంగంలో విరివిగా కంప్యూటర్లు వాడకంలోకి వచ్చి బ్యాంకింగ్ సేవలు వేగంగాను, సమర్థవంతంగాను అమలు చేయడానికి వీలు కలిగింది. సరళీకరణ తర్వాత భారత బ్యాంకింగ్ వ్యవస్థలోకి విదేశీ బ్యాంకులకు ద్వారాలు తెరడంతో పోటీ తీవ్రమయ్యింది. భారత బ్యాంకులు తమ పని విధానాన్ని పూర్తిగా మార్చుకోవల్సి వచ్చింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్లను వినియోగం తప్పనిసరయ్యింది. వివిధ కమిటీలు బ్యాంకింగ్‌లో పూర్తి కంప్యూటరీకరణ అవసరమని నొక్కి చెప్పాయి. బ్యాంకు ఉద్యోగ సంఘాలకు,

SAKSHI

ఐబీఏకు మధ్య కుదిరిన ఒప్పందంతో 1993 నుంచి దేశవ్యాప్తంగా బ్యాంకుల్లో కంప్యూరీకరణ ప్రారరభమైంది. బ్యాంకుల మధ్య ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఈఎఫ్‌టీ), చెక్కుల ప్రాసెసింగ్‌లో ఎంఐసీఆర్ (మ్యాగ్నటిక్ ఇంక్ క్యారక్టర్ రికగ్నిషన్ పద్ధతి అమలులోకి వచ్చాయి. దీంతో బ్యాంకింగ్ కార్యకలాపాలలో భద్రతతో పాటు వేగం కూడా పెరిగింది. ఇక ఇంటర్నెట్ బ్యాంకింగ్, నెట్‌వర్కింగ్, ఎటీఎం (ఆటోమేటెడ్ టెల్లింగ్ మిషన్)లు ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందుబాటులోకి తెచ్చాయి.

ప్రస్తుం దేశంలోని వాణిజ్య బ్యాంకుల వ్యవస్థను మూడు తరగతులుగా విభజించవచ్చు. అవి

1. ప్రభుత్వ రంగ బ్యాంకులు(Public Sector Banks)
2. ప్రైవేటు రంగ బ్యాంకులు(Private Sector Banks)
3. సహకార రంగ బ్యాంకులు(Cooperative Banks)

### ప్రభుత్వ రంగ బ్యాంకులు

1.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాని అనుబంధ బ్యాంకులు వీటిని స్టేట్ బ్యాంక్ గ్రూప్‌గా పిలుస్తారు.
2. జాతీయం చేసిన 20 వాణిజ్య బ్యాంకులు
3. ప్రధాన వాణిజ్య బ్యాంకులు ఆధ్వర్యంలో (స్పాన్సర్‌తో) నడిచే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు.

### ప్రైవేటు రంగ బ్యాంకులు

1. పాత తరం ప్రైవేటు బ్యాంకులు
2. కొత్త తరం ప్రైవేటు బ్యాంకులు
3. విదేశీ బ్యాంకులు
4. షెడ్యూల్డు సహకార బ్యాంకులు
5. షెడ్యూలేతర బ్యాంకులు

### సహకారం రంగంలో బ్యాంకింగ్ వ్యవస్థ

ప్రధానంగా గ్రామీణ భారత దేశంలో వడ్డీ వ్యాపారుల కంబంధ హస్తాల నుంచి పేద రైతులను, ప్రజలను కాపాడేందుకు సహకార బ్యాంకింగ్ వ్యవస్థను నెలకొల్పారు. వీటిని ఎనిమిది కేటగిరీలుగా పేర్కోవచ్చు. అవి.

- రాష్ట్ర సహకార బ్యాంకులు
- కేంద్ర సహకార బ్యాంకులు
- ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీలు (ప్రాథమిక వ్యవసాయ పరపతి మండళ్ళు)
- భూమి అభివృద్ధి బ్యాంకులు

- పట్టణ సహకార బ్యాంకులు
- ప్రాథమిక వ్యవసాయ అభివృద్ధి బ్యాంకులు
- ప్రాథమిక భూమి అభివృద్ధి బ్యాంకులు
- రాష్ట్ర భూమి అభివృద్ధి బ్యాంకులు

అభివృద్ధి బ్యాంకులు(Development Banks)

1. ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (IFCI)
2. ఇండిస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (IDBI)
3. ఇండస్ట్రియల్ క్రెడిట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ICICI)
4. ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (IIBI)
5. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SIDBI)
6. ఎస్‌సీఐసీఐ లిమిటెడ్(SCICI)
7. నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (NABARD)
8. ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(EXIM Bank)
9. నేషనల్ హౌసింగ్ బ్యాంక్(NHB)

సరఫరాలోనూ, వివిధ సేవలు, కార్యక్రమాల అమలులోను, అన్ని ప్రాంతాలకు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి రావడంలోనూ బ్యాంకులు చురుకుగా వ్యవహరిస్తున్నాయి. మొత్తం మీద భారత దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ సమర్థవంతమైన పనితీరును ప్రదర్శిస్తోంది. అయితే ప్రైవేటు బ్యాంకులు, విదేశీ బ్యాంకులు ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించడానికి కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

భారత ఆర్థిక వ్యవస్థ ఇటీవల కాలంలో బలోపేతం కావడం, సేవల రంగంలో జరిగిన పురోభివృద్ధి బ్యాంకింగ్ అవసరాలను , ముఖ్యంగా రిటైల్ బ్యాంకింగ్, మార్టగేజ్ (కుదవ)-ఇన్వెస్ట్‌మెంట్ (మదుపు) సేవలు తప్పనిసరి చేసింది. బ్యాంకుల పనితీరు పెరిగినప్పటికీ ప్రజలకు అందుబాటులో వచ్చే నిష్పత్తి విషయంలో వేగం కనపడటం లేదు. మణిపూర్ రాష్ట్రం అతి తక్కువ బ్యాంకు శాఖలతో 33 వేల మందికి ఒక్క బ్యాంకు చొప్పను సేవలందిస్తోంది. తర్వాత నాగాలాండ్ లో 26 వేల మందికి ఒక బ్యాంకు, బీహార్‌లో 25 వేల మందికి ఒక బ్యాంకు పనిచేస్తున్నాయి. ఇక డిపాజిట్ అకౌంట్లలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య బాగా వ్యత్యాసం కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి 978 డిపాజిట్ అకౌంట్లు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 245 అకౌంట్లే ఉన్నాయి. అలాగే రుణాల స్వీకరణకు సంబంధించి పట్టణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి 161 అకౌంట్లు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇవి 42 మాత్రమే ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ సమాచారం ప్రకారం 2010 ఆగస్టు 27 నాటికి దేశంలోని అన్ని

SAKSHI

షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.46,70,237.91 కోట్లు. డిపాజిట్లు ఏటా 14.44 శాతం చొప్పున పెరుగుతూ వస్తున్నాయి. ఇదే సమయానికి బ్యాంకులు మంజూరు చేసిన మొత్తం రుణం రూ. 33,51,396 కోట్లు. రుణ మంజూరు ఏటా 19.81 శాతం చొప్పున పెరుగుతూ వస్తోంది.

## భారతీయ రిజర్వు బ్యాంకు (RBI):

భారత రిజర్వు బ్యాంకు చట్టం, 1934 ప్రకారం రిజర్వు బ్యాంకు 1935 ఏప్రిల్ 1న ఏర్పాటైంది. రిజర్వు బ్యాంకును 1949 జనవరి 1న ప్రభుత్వం జాతీయం చేసింది. దేశంలో అన్ని కరెన్సీ నోట్లను (ఒక్క రూపాయి నోటు తప్ప) ముద్రించి జారీ చేసే అధికారం ఒక్క రిజర్వు బ్యాంకుకే ఉంది. ఈ నోట్ల చెలామణితో పాటు కేంద్ర ప్రభుత్వం జారీ చేసే రూపాయి నోటు, రూపాయి నాణెం, ఇంకా చిల్లర నాణేలను కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు చెలామణిలోకి తెస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బ్యాంకర్‌గా వ్యవహరిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రుణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. దేశంలో ధరల స్థిరీకరణకు రిజర్వు బ్యాంకు ద్రవ్య విధానాన్ని రూపొందించి అమలు చేస్తుంది. ఇందుకు అన్ని రంగాల్లో సక్రమమైన పెట్టుబడులను ప్రోత్సహిస్తూ అభివృద్ధికి కృషి చేస్తుంది. విదేశీ ద్రవ్య మార్కెట్‌లో భారత దేశం ఎటువంటి ఒడిదుడుకులు ఎదుర్కోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడంలో కీలక పాత్ర వహిస్తుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలో భారత దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తుంది.

## జాతీయీకరణ తర్వాత బ్యాంకింగ్ రంగం పనితీరు:

జాతీయీకరణకు ముందు దేశంలో ప్రైవేట్ రంగంలోని వాణిజ్య బ్యాంకులు ఇంగ్లండ్ బ్యాంకుల తరహాలోనే స్వల్పకాల రుణాలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించేవి. దీర్ఘకాల పెట్టుబడుల విషయంలో ప్రత్యక్ష పరపతిని నిర్లక్ష్యం చేశాయని చెప్పొచ్చు. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో చిన్నతరహా సంస్థలకు ఇచ్చే రుణాల వల్ల నష్టం వాటిల్లుతుందనే భావనతో పరపతి విషయంలో బ్యాంకులు ఆ రంగాన్ని పట్టించుకోలేదు. జాతీయీకరణకు ముందు ప్రాధాన్యతా రంగం మొత్తం పరపతి విషయంలో నిర్లక్ష్యానికి గురైందని చెప్పొచ్చు. పరపతి విషయంలో ప్రాధాన్యతా రంగానికి పెద్ద పీట వేయడం ద్వారా ఆ రంగంపై ఆధారపడిన ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా వాణిజ్య బ్యాంకులను 1969లో కేంద్ర ప్రభుత్వం జాతీయం చేసింది. మొదటి విడతగా 1969లో ₹ 50 కోట్ల డిపాజిట్లను కలిగి ఉన్న బ్యాంకులను, రెండో విడతగా 1980లో ₹20 కోట్ల పైచిలుకు డిపాజిట్లు ఉన్న బ్యాంకులను ప్రభుత్వం జాతీయం చేసింది.

జాతీయీకరణ తర్వాత ప్రభుత్వ ముఖ్య లక్ష్యాలైన సామాజిక న్యాయం, సమానత్వ సాధన వంటి విషయాల్లో బ్యాంకింగ్ రంగం ప్రభుత్వానికి తగిన విధంగా చేయూతనిచ్చిందని చెప్పొచ్చు. ముఖ్యంగా బలహీన వర్గాల ప్రజలు వివిధ ఉత్పాదక కార్యకలాపాలను చేపట్టే దిశగా వాణిజ్య బ్యాంకులు తమ నిధులలో కొంత భాగాన్ని వారి కోసం కేటాయించాయి. తక్కువ వడ్డీతో వారికి పరపతి సౌకర్యాన్ని

కల్పించాయి. రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాల ప్రకారం వాణిజ్య బ్యాంకులు ఇచ్చే మొత్తం రుణాల్లో 40 శాతం ప్రాధాన్యతా రంగాలకు కేటాయించాల్సి ఉండగా అంత కంటే ఎక్కువ మొత్తంలోనే ఆ రంగానికి రుణాలు లభిస్తున్నాయి. జాతీయీకరణ తర్వాత బ్యాంకింగ్ సౌకర్యాలు కూడా విస్తరించాయి. బ్యాంకు సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో కూడా వాణిజ్య బ్యాంకులు తమ శాఖలను ప్రారంభించాయి.

జాతీయీకరణ తర్వాత బ్యాంకింగ్ రంగం గుణాత్మకంగానే కాకుండా పరిమాణాత్మక ప్రగతి కూడా సాధించింది. 1969లో మొత్తం జాతీయం చేసిన వాణిజ్య బ్యాంకుల శాఖల సంఖ్య (ఎస్‌బీఐ అసోసియేటెడ్ బ్యాంకులు, 19 జాతీయం చేసిన బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు) 7051. కాగా వీటి సంఖ్య 2005 నాటికి 62045కు పెరిగింది. ప్రస్తుతం వీటి సంఖ్య 80 వేలకు పైమాటే. మొత్తం వాణిజ్య బ్యాంకులు 51 శాతం శాఖలను గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేశాయి. ఇదే సమయంలో వాణిజ్య బ్యాంకుల్లో డిపాజిట్లు ₹3896 కోట్ల నుంచి ₹1139 వేల కోట్లకు పెరిగాయి. ఈ బ్యాంకులు అందించిన పరపతి కూడా ₹3036 కోట్ల నుంచి ₹6,19,660 కోట్లకు చేరింది.

ప్రస్తుతం కొన్ని వాణిజ్య బ్యాంకులు మర్చంట్ బ్యాంకింగ్ డివిజన్లను ఏర్పాటు చేశాయి. కొన్ని ప్రభుత్వ బ్యాంకులు మ్యూచువల్ ఫండ్‌లను ప్రారంభించాయి. వాణిజ్య బ్యాంకులు అభివృద్ధి, సాధన దిశగా 'రిటైల్ బ్యాంకింగ్'ను ప్రోత్సాహకరమైన మార్కెట్ సెగ్మెంట్‌గా భావిస్తున్నాయి. అందులో భాగంగా గృహరుణాలు, వస్తువుల కొనుగోళ్లకు రుణ సౌకర్యాన్ని అందిస్తున్నాయి. తక్కువ వ్యయంతో కూడుకున్న బ్యాంకు లావాదేవీలను ప్రజలకు అందించే ఉద్దేశంతో ఏటీఎం సర్వీసులను ప్రారంభించాయి. ఇంటర్నెట్ బ్యాంకింగ్, 'వెంచర్ క్యాపిటల్ ఫండ్' వంటి సౌకర్యాలను కూడా ప్రజలకు అందుబాటులోకి తెచ్చాయి.

జాతీయీకరణ తర్వాత వాణిజ్య బ్యాంకులు కొంత ప్రగతి సాధించాయి. అయితే బ్యాంకింగ్ కార్య కలాపాల సమర్థత కొంత తక్కువగా ఉందని చెప్పొచ్చు. రికవరీ కాని రుణాలు బ్యాంకింగ్ రంగంలో తగ్గినప్పటికీ.. కొన్ని బ్యాంకులు తక్కువ లాభాలు ఆర్జిస్తున్నాయి. మరికొన్ని బ్యాంకులు నష్టాల్లో ఉన్నాయి. కొన్ని ముఖ్య కార్యకలాపాలకు ప్రత్యక్షపరపతి అందించాలనే ప్రభుత్వ విధానాల కారణంగా బ్యాంకింగ్ రంగంలో లాభదాయకత తగ్గింది. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగ సంస్కరణ నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో బ్యాంకులు పెరగడంతో ప్రభుత్వరంగ బ్యాంకులు కొంత ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని చెప్పొచ్చు. 1998లో నరసింహం కమిటీ వ్యక్తం చేసిన అభిప్రాయం మేరకు.. బ్యాంకులకు స్వయం ప్రతిపత్తి కల్పించినట్లయితే తమ కార్యకలాపాలను విస్తృత పరచుకొని దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయి.

## నరసింహం కమిటీ సిఫార్సులు

ప్రభుత్వ రంగంలోని వాణిజ్య బ్యాంకుల్లో ఉత్పాదకత, సమర్థత తగ్గడంతోపాటు పోర్ట్‌ఫోలియో నాణ్యత కొరవడి లాభదాయకత తగ్గిందని ప్రభుత్వం భావించింది. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా బ్యాంకింగ్ రంగం పనితీరును పరిశీలించి, దేశ ఆర్థికాభివృద్ధిలో ఆ రంగం ప్రధాన పాత్ర పోషించే విధంగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు సూచించడానికి కేంద్ర ప్రభుత్వం 1991లో నరసింహం కమిటీని ఏర్పాటు చేసింది.

1969 తర్వాత శాఖల విస్తరణ, డిపాజిట్ల పరిమాణం పెరుగుదల, గ్రామీణ ప్రాంతాల్లో శాఖల ఏర్పాటు, ప్రాధాన్యతా రంగానికి పరపతి పెంపు, 300 మిలియన్ల డిపాజిట్ ఖాతాలు, బ్యాంకు కార్యకలాపాలు లేని ప్రాంతాల్లో బ్యాంకింగ్ రంగం విస్తరించడం వంటి సకారాత్మక పరిణామాలు బ్యాంకింగ్ రంగంలో చోటు చేసుకున్నాయి. అయితే ప్రత్యక్ష పెట్టుబడి, ప్రత్యక్ష పరపతి కార్యక్రమాలు అనే రెండు రకాల చర్యలు వాణిజ్య బ్యాంకుల లాభదాయకతను దెబ్బతీశాయని నరసింహం అభిప్రాయ పడ్డారు. వాణిజ్య బ్యాంకులు ఇష్టానుసారంగా శాఖలు ఏర్పాటు చేయడంతో వీటిపై సెంట్రల్ ఆఫీసు పర్యవేక్షణ కొరవడిందని, సిబ్బంది సంఖ్య విపరీతంగా పెరగడం, ఈ క్రమంలో పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయడంతో మానవ వనరుల నాణ్యత తగ్గిందని కూడా నరసింహం అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యవసాయం, చిన్నతరహా సంస్థలకు ఇచ్చిన రుణాల వల్ల వాటి నిర్వహణకు అయ్యే యూనిట్ వ్యయం పెరిగింది. తద్వారా బ్యాంకుల లాభదాయకత తగ్గి నిర్వహణ సామర్థ్యం కొరవడిందని నరసింహం పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలోని ఆర్థిక సంస్థలు ఎస్‌ఎల్‌ఆర్ (స్టాట్యుటరీ లిక్విడిటీ రేషియో) అనే ముఖ్య సాధనం ద్వారా ప్రభుత్వానికి వనరులను సమీకరించడం నిలిపివేయాలని నరసింహం కమిటీ సిఫార్సు చేసింది. వచ్చే ఐదేళ్ల కాలంలో ప్రస్తుతం ఉన్న ఎస్‌ఎల్‌ఆర్‌ను 38.5 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలి. నగదు-నిల్వల నిష్పత్తిని దశల వారీగా తగ్గించాలి. దీన్ని ప్రస్తుతం ఉన్న 15 శాతం నుంచి 3.5 శాతానికి కుదించాలి.

ప్రత్యక్ష పరపతి కార్యక్రమాన్ని శాశ్వతంగా కొనసాగించకుండా తాత్కాలిక కార్యక్రమంగానే చేపట్టాలి. ప్రాధాన్యతా రంగానికి బ్యాంకులిచ్చే పరపతిని 40 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలి.

విలీనాల ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల శాఖలను తగ్గించినట్లయితే వాణిజ్య బ్యాంకుల సమర్థత పెరుగుతుందని కమిటీ అభిప్రాయపడింది.

ఎ) మూడు లేదా నాలుగు అంతర్జాతీయ కార్యకలాపాలు కూడా నిర్వర్తించే సామర్థ్యం ఉన్న పెద్ద బ్యాంకులు.

బి) ఎనిమిది నుంచి పది జాతీయ బ్యాంకులు తమ శాఖలను దేశవ్యాప్తంగా కలిగి ఉండి సాధారణ లేదా యూనివర్సల్ బ్యాంకింగ్ రంగంలో నిమగ్నమైనవి.

సి) ప్రత్యేక ప్రాంతాలకు సంబంధించి కార్యకలాపాలు నిర్వర్తించడానికి స్థానిక బ్యాంకుల ఏర్పాటు.

డి) గ్రామీణ బ్యాంకులు (ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులతో కలిపి) తమ కార్యకలాపాలను గ్రామీణ ప్రాంతాల్లోనే కొనసాగిస్తూ వ్యవసాయం, అనుబంధ రంగాలకు పరపతి కల్పించేవి.

బ్యాంకులిచ్చే రుణాలు, స్వీకరించే డిపాజిట్లపై వడ్డీకి సంబంధించి అన్ని రకాల నియంత్రణలను తొలగించాలి. మిగతా ఆర్థిక సంస్థలకు సంబంధించి డిబెంచర్లు, కంపెనీ డిపాజిట్లపై వడ్డీ విధానంపై ఉన్న అన్ని విధాలైన నియంత్రణలను కూడా ఎత్తివేయాలి. బ్యాంకులు తమ వడ్డీ రేట్లను మార్కెట్ శక్తులకనుగుణంగా నిర్ణయించుకునే స్వేచ్ఛనివ్వాలి.

బ్యాంకుల జాతీయీకరణను చేపట్టరాదని కమిటీ ప్రభుత్వానికి సూచించింది. కేంద్ర బ్యాంకు ప్రైవేటు రంగంలో వాణిజ్య బ్యాంకుల ఏర్పాటుకు అనుమతినివ్వాలి. రికవరీ కాని రుణాల కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందుల నుంచి వాణిజ్య బ్యాంకులను కొంతవరకు ఆదుకోవడానికి 'అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ఫండ్'ను ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది.

## 1998లో నరసింహం కమిటీ సిఫార్సులు:

మూల ధన అకౌంట్‌లో రూపాయి మార్పిడిని అనుమతించే నేపథ్యంలో.. మూలధన ప్రవాహాల్లో ఒడిదుడుకులు చోటు చేసుకుంటాయి. వీటి వల్ల విదేశీ మారక రేటులో హెచ్చు తగ్గులు ఏర్పడి స్వదేశంలో ద్రవ్యత్వంలో నెలకొనే సమస్యలను అధిగమించాలంటే బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని కమిటీ అభిప్రాయపడింది. బ్యాంకింగ్ వ్యవస్థలో నష్టభయాన్ని ఎదుర్కొనే సామర్థ్యం పెంచే దిశగా క్యాపిటల్ అడిక్వసీ రేషియోను పెంచాలని కూడా కమిటీ అభిప్రాయపడింది.

ప్రభుత్వ జోక్యాన్ని నివారిస్తూ బ్యాంకు బోర్డులు స్వేచ్ఛగా పనిచేసే విధంగా వ్యవస్థలో మార్పు తీసుకురావాలని కమిటీ సిఫార్సు చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులను కంప్యూటరీకరించడం, రిక్రూట్‌మెంట్ విధానాన్ని పునఃసమీక్షించడం, శిక్షణ, రెమ్యునరేషన్ విధానాలకు సంబంధించి కూడా కమిటీ కొన్ని కీలక ప్రతిపాదనలను చేసింది.

## ద్రవ్య విధానం- చక్రవర్తి కమిటీ సిఫార్సులు

1920, 1930లలో భారత ద్రవ్య వ్యవస్థను 'హిల్టన్ యంగ్ కమిషన్', 'సెంట్రల్ బ్యాంక్ ఎంక్వయిరీ కమిటీ'లు సమీక్షించిన తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. స్వాతంత్ర్యానంతరం దేశంలో పంచవర్ష ప్రణాళికల అమలు కోసం అవసరమైన వనరుల సమీకరణకు భారత ద్రవ్య వ్యవస్థ తోడ్పడింది. ఆర్థికాభివృద్ధిని త్వరితగతిన సాధించే క్రమంలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించే దిశగాను ద్రవ్య వ్యవస్థ పనిచేసింది. ద్రవ్యవ్యవస్థ పనితీరును సమీక్షించే నేపథ్యంలో రిజర్వ్ బ్యాంకు 1982 లో సుఖమోయ్ చక్రవర్తి అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి నేపథ్యంలో.. ద్రవ్యవ్యవస్థ నిర్మాణత, నిర్వహణను సమీక్షించాలని కమిటీని కేంద్ర బ్యాంకు కోరింది. ద్రవ్య, పరపతి విధానాల సాధనాల పనితీరు, ద్రవ్యవిధానం, ప్రభుత్వ వ్యయం నిర్వహణ

మధ్య ఉన్న సంబంధం వంటి అంశాలను కూడా సమీక్షించాలని కమిటీకి సూచించింది.

పొదుపు సమీకరణ, వినియోగం అనేవి సామాజిక ధ్యేయాలను సాధించే విధంగా ఉండాలని కమిటీ అభిప్రాయపడింది. పొదుపు రేటు 1950 – 51లో జీడీపీలో 10 శాతం కాగా 1983 – 84లో 23 శాతానికి పెరిగింది. అయితే ఈ పొదుపు ప్రభుత్వ రంగ పెట్టుబడికి సరిపడకపోవడంతో ప్రభుత్వం లోటు బడ్జెట్ విధానాన్ని పాటిస్తుందని కమిటీ అభిప్రాయపడింది. ద్రవ్యోల్బణ పరిస్థితులు తలెత్తకుండా పంచవర్ష ప్రణాళికల అమలు కోసం అవసరమైన ఆర్థిక వనరులను సమీకరించాలి. ఈక్రమంలో ప్రజల నుంచి పొదుపు, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పొదుపు రేట్లను పెంచేవిధంగా తగిన చర్యలను చేపట్టాలి. రెవెన్యూ రాబడి, వ్యయ విధులను నిర్వర్తించడంలో సమర్థత పెరగాలని కూడా కమిటీ అభిప్రాయపడింది.

ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధిలో భాగంగా.. కేంద్ర బ్యాంకు 'ధరల స్థిరత్వం' అనే లక్ష్యాన్ని ఎంచుకుంది. ధరల స్థిరత్వం అంటే.. ధరల్లో ఎటువంటి మార్పు లేకుండా స్థిరంగా నిర్వహించడం మాత్రమే కాదని.. టోకు ధరల సూచీలో సాంవత్సరిక పెరుగుదల 4 శాతంగా ఉంచడమని కూడా కమిటీ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో రుతుపవనాల అననుకూలత కారణంగా వ్యవసాయ రంగం ఉత్పత్తిలో చోటుచేసుకునే ఒడిదుడుకులతో ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడటాన్ని కమిటీ గుర్తించింది. ఈ సందర్భంగా సప్లయ్ యాజమాన్య చర్యలు అవసరమని కమిటీ పేర్కొంది. మరోవైపు డిమాండ్ యాజమాన్య చర్యల అవసరాన్ని కూడా కమిటీ గుర్తించి పరపతి సమర్థ వినియోగంలో ప్రభుత్వం, కేంద్ర బ్యాంకుల మధ్య సమన్వయం తప్పనిసరని అభిప్రాయం వ్యక్తం చేసింది. 'మానిటరీ టార్గెటింగ్' ఆధారంగా ద్రవ్యవిధానాన్ని రూపొందించాలని కూడా కమిటీ సిఫార్సు చేసింది.

1970 తర్వాత కాలంలో ద్రవ్య సప్లయ్‌లో విపరీతమైన పెరుగుదల ఏర్పడటానికి కేంద్ర బ్యాంకు నుంచి ప్రభుత్వం ఎక్కువగా రుణాలు తీసుకోవడమే కారణమని కమిటీ అభిప్రాయపడింది. ప్రభుత్వం, కేంద్ర బ్యాంకు నుంచి రుణాలను సమీకరించే విషయంలో ఉమ్మడి విధాన దృక్పథాన్ని రూపొందించుకోవాలని సిఫార్సు చేసింది. బడ్జెట్ లోటు పద నిర్వచనంలో మార్పు తీసుకువస్తే..రెవెన్యూ లోటు, ద్రవ్య లోటు, మొత్తం బడ్జెటరీ లోటు పదాలకు సంబంధించి కచ్చితమైన తేడా ఏర్పడుతుందని కమిటీ అభిప్రాయపడింది. సమర్థమైన ద్రవ్య మార్కెట్ అభివృద్ధిలో భాగంగా కేంద్ర బ్యాంకు అవసరమైన చర్యలు చేపట్టాలని కూడా సూచించింది.

## స్వాతంత్ర్యానంతరం కేంద్ర బ్యాంకు అవలంభించిన ద్రవ్య విధానం

భారత్‌లో పంచవర్ష ప్రణాళికలు, స్థూల ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా లక్ష్యాల సాధన నేపథ్యంలో ద్రవ్య విధానంలో మార్పులు సంభవించాయి. పొదుపు సమీకరణ, వివిధ రంగాల్లో వనరుల పంపిణీ సక్రమంగా జరిగేలా స్వాతంత్ర్యానంతరం కేంద్ర బ్యాంకు అవలంబించిన ద్రవ్య విధానం తోడ్పడింది.

ధరల స్థిరత్వం సాధించడంతోపాటు, జాతీయ కరెన్సీ స్థిరత్వం, ఉపాధివృద్ధి, ఆదాయవృద్ధిపై ద్రవ్య విధానం దృష్టి కేంద్రీకరించింది.

1951 నుంచి 1972 మధ్యలో పరిశ్రమలు, వాణిజ్య రంగానికి అవసరమైన పరపతి అందించడం ద్వారా అనుత్పాదక, అంచనా వ్యాపార నిమిత్తం పరపతి తగ్గించే చర్యల్లో భాగంగా నియంత్రణతో కూడిన విస్తరణ (controlled expansion) విధానాన్ని కేంద్ర బ్యాంకు అమలు చేసింది. 1972–91 మధ్య ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి 'కఠిన ద్రవ్య విధానాన్ని' అవలంబించింది. కోశ విధానాల రెస్పాన్స్‌కు అనుగుణంగా ద్రవ్య విధానాన్ని రూపొందించారు. 1970–80లలో ద్రవ్యలోటు పెరిగింది. ప్రభుత్వానికి కేంద్రబ్యాంకు అధిక పరపతి ఇచ్చిన కారణంగా దేశంలో ద్రవ్య సప్లయ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ద్రవ్య విధానం ద్వారా కేంద్రబ్యాంకు ద్రవ్యోల్బణ ప్రభావాన్ని నియంత్రించడానికి కృషి చేసింది. 1991 తర్వాత ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ద్రవ్యలోటు తగ్గించడానికి ద్రవ్య విధానం తోడ్పడింది. 1995 వరకు ధరల స్థిరత్వం సాధించే దిశగా ద్రవ్య విధానాన్ని రూపొందించగా తర్వాత కాలంలో అధిక వృద్ధి సాధన దిశగా ద్రవ్య విధానాన్ని కేంద్రబ్యాంకు అమలు చేసింది. 1999 తర్వాత ద్రవ్య విధాన ప్రభావం ఆర్థిక వ్యవస్థ అధిక వృద్ధి దిశగా పయనించడానికి దోహదం చేసింది. 2007 తర్వాత ప్రపంచ ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతోపాటు భారత్‌లో కూడా కొన్ని రంగాలపై సంక్షోభ ప్రభావం కనిపించింది. పారిశ్రామిక ఉత్పత్తి తగ్గుదల, ఎగుమతుల రాబడిలో తగ్గుదల, సేవా కార్యకలపాల తగ్గుదల, కార్పొరేటు రంగంలో మార్జిన్‌లు తగ్గడం, వ్యాపారంపై విశ్వాసం తగ్గడం వంటి స్థితి దేశంలో కనిపించింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 2008లో 'డాలర్ లిక్విడిటీ'ని అవసరమైన మేరకు నిర్వహించడం ద్వారా ఉత్పాదక రంగాలకు పరపతి పెంచే విధంగా కేంద్రబ్యాంకు ద్రవ్య విధానాన్ని ప్రకటించింది. విత్త మార్కెట్ల పనితీరు సక్రమంగా ఉండటం, గ్రామీణ డిమాండ్‌లో పెరుగుదల, విదేశీ మారక నిల్వలు ఎక్కువగా ఉండటం వంటి చర్యలు ఆర్థిక సంక్షోభాన్నుంచి భారత్ గట్టెక్కడానికి దోహదం చేశాయి. ఆ కాలంలో రెపో రేటును 4.75 శాతానికి తగ్గించడం, రివర్స్ రెపో రేటును 3.25 శాతానికి తగ్గించడం, నగదు – నిల్వల నిష్పత్తిని 5 శాతంగా ఉంచడం ద్వారా కేంద్రబ్యాంకు అవలంబించిన ద్రవ్య విధానం ఆర్థిక వ్యవస్థ పురోగమన దిశగా పయనించడానికి తోడ్పడింది. ప్రపంచ వస్తుధరల ధోరణి, స్వదేశీ డిమాండ్, సప్లయ్ ధోరణులను దృష్టిలో ఉంచుకొని మార్చి 2010 నాటికి టోకు ధరల సూచీ 4 శాతంగా ప్రతిపాదించింది.

మార్చి 5, 2011 నాటికి ఆహార ద్రవ్యోల్బణం 9.42 శాతంగా నమోదైంది. ఈ క్రమంలో కేంద్ర బ్యాంకు తన ద్రవ్య విధానంలో భాగంగా రెపోరేటు, రివర్స్ రెపోరేటులను పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం రేటును రెండోసారి సవరిస్తూ మార్చి 2011 నాటికి ద్రవ్యోల్బణం 8 శాతంగా అంచనా వేసింది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే చర్యల్లో భాగంగా రెపోరేటును 6.75 శాతం, రివర్స్ రెపోరేటును 5.75 శాతంగా నిర్ణయించింది. ఈ చర్యల వల్ల ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యత్వం తగ్గి

ద్రవ్యోల్బణం నియంత్రణ జరుగుతుంది.

## బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు

బ్యాంకు చట్టబద్ధమైన నిర్వచనంతో సంబంధం లేకుండా బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహించే విత్త సంస్థలను బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు అంటారు. అన్ని విధాలైన బ్యాంకింగ్ సేవలు అంటే రుణ పరపతి, ప్రైవేటు విద్యకు పరపతి, రిటైర్‌మెంట్ ప్లానింగ్, ద్రవ్య మార్కెట్‌లో ట్రేడింగ్, స్టాక్స్, షేర్ల అండర్ రైటింగ్ వంటి కార్యకలాపాలను ఈ సంస్థలు నిర్వహిస్తాయి. గత కొన్ని సంవత్సరాలుగా 'వెంచర్ క్యాపిటల్ కంపెనీలు'గాను, రిటైల్, పారిశ్రామిక కంపెనీలుగా ఎన్‌బీఎఫ్‌సీ (నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ)లు తమ కార్యకలాపాలను విస్తరించాయి.

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు కార్యకలాపాల స్వభావాన్ని బట్టి వాటిని,

**1) డెవలప్‌మెంట్ ఫైనాన్స్ సంస్థలు**

**2) లీజింగ్ కంపెనీలు**

**3) పెట్టుబడి కంపెనీలు**

**4) మోడర్న్ కంపెనీలు**

**5) గృహ ఫైనాన్స్ కంపెనీలు**

**6) వెంచర్ క్యాపిటల్ కంపెనీలు**

**7) డిస్కౌంట్, గ్యారంటీ హౌస్‌లుగా వర్గీకరించవచ్చు.**

రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934కు లోబడి కేంద్ర బ్యాంకు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలను నియంత్రిస్తుంది. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు పబ్లిక్ డిపాజిట్లు సేకరించరాదు. నిర్ధారిత సర్టిఫికేట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఉన్న కంపెనీలు మాత్రమే పబ్లిక్ డిపాజిట్లు తీసుకోవాలి. డిపాజిట్ల కనీస కాలపరిమితి 12 నెలలుగాను గరిష్ట కాలపరిమితి 60 నెలలుగాను ఉంటుంది. డిమాండ్‌పై వెంటనే చెల్లించే డిపాజిట్లను ఈ సంస్థలు అనుమతించకూడదు. కేంద్ర బ్యాంకు సూచించిన వడ్డీ రేటు కంటే ఎక్కువ వడ్డీని ఈ సంస్థలు వసూలు చేయకూడదు. ఈ సంస్థలు డిపాజిట్లపై చెల్లించే వడ్డీ సంవత్సరానికి 12.4 శాతం కాకుండా మరే ఇతర ప్రోత్సాహకాలను డిపాజిట్ దార్లకు ప్రకటించకూడదు. ఎన్‌బీఎఫ్‌సీలలో ఉన్న డిపాజిట్లకు ఎటువంటి బీమా సౌకర్యం ఉండదు. ఇవి తిరిగి చెల్లించాల్సిన డిపాజిట్లకు సంబంధించి కేంద్రబ్యాంకు ఎటువంటి హామీ ఇవ్వదు. కేంద్ర బ్యాంకు వద్ద నమోదు అయిన ఎన్‌బీఎఫ్‌సీలు మొత్తం (డిపాజిట్లు అంగీకరించేవి, అంగీకరించనవి) జూన్ 2009లో 12740 కాగా అవి 2010 నాటికి 12630కి తగ్గాయి. సంస్కరణల కాలంలో వీటికి సంబంధించి అవలంబించిన నియంత్రణ విధానం వల్ల వీటి సంఖ్యలో తగ్గుదల సంభవించింది. డిపాజిట్లు స్వీకరించే ఎన్‌బీఎఫ్‌సీల సంఖ్య ఇదే కాలంలో 336 నుంచి 308 కి తగ్గింది.